జయ హనుమాన జ్ఞాన గుణసాగర

- వైభవంగా హనుమజ్జయంతి
- జై శ్రీరామ్, జై హనుమాన్ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించిన భక్తులు
- ఆకట్టుకున్న శోభాయాత్ర

చీరాలటౌన్/చీరాలఅర్బన్/వేటపాలెం: శ్రీరామ దూత.. అమితమైన బలవంతుడు, అంజని పుత్రుడు, పవన సుతుడు, మహావీరుడు, జ్ఞాన గుణ సంపన్నుడైన హనుమంతుని పండుగ హనుమజ్జయంతిని గురువారం వాడవాడలా వైభవంగా నిర్వహించారు. చీరాల మండలంలోని రూరల్ గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో వైభవంగా హనుమజ్జయంతి నిర్వహించారు. మండలంలోని ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ వద్ద ఉన్న అభయాంజనేయస్వామి వారి దేవాలయం వద్ద వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హాజరై ప్రత్యేక పూజలు చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. బుర్లవారిపాలెం స్ట్రయిట్‌కట్ వద్ద, గవినివారిపాలెం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

➤ చీరాల పట్టణంలోని బోస్‌నగర్‌లోని వీరాంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి తెల్లవారుజాము నుంచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, స్వామివారి పంచామృతాలతో అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. పలు రకాల పూలతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. పేరాలలోని భావనారుషి దేవాలయం, మదనగోపాలస్వామి దేవాలయం, సాయిబాబా గుడి ఆవరణలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం, కొత్తపేట ఓంకార క్షేత్రం, పాపరాజుతోటలోని వీరాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి బంగారు కిరీటంతో అలంకరణ చేశారు.

➤ వేటపాలెం వన్‌వే రోడ్డులో గల శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామివారి దేవస్థానం ప్రాంగణంలో వీరాంజనేయస్వామి, సంతరావూరులో ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కాయిపాలెం, దేశాయిపేట పంచాయతీ దంతంపేటలో, రామన్నపేట పంచాయతీ బైపాస్ రోడ్డు పక్కన అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు, మహిళలు..

పర్చూరు(చినగంజాం)/చినగంజాం/యద్దనపూడి/కారంచేడు/మార్టూరు: హనుమజ్జయంతి పురస్కరించుకొని పర్చూరు నియోజవర్గంలోని ఆలయాల్లో అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మార్టూరు మండలంలోని పలు గ్రామాల ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం మార్టూరు, రాజుపాలెం, కోలలపూడి, వలపర్ల తదితర గ్రామాల్లోని రామాలయాలలో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. పూజారులు హనుమంతుడికి ఇష్టమైన ఆకు పూజ, పంచామృతాలు, పళ్ల రసాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానాలు చేశారు. వలపర్ల గ్రామంలో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు

➤ కారంచేడులో కృష్ణ కాలువ సెంటర్‌లో కొలువైన ఆంజనేయస్వామి విగ్రహాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మధ్యాహ్నం నుంచి భక్తులకు పులిహోర, స్వామివారి పొంగళ్లు ప్రసాదంగా పంపిణీ చేశారు. పెద బజారు శివాలయంలోను ప్రసన్నాంజనేయస్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కారంచేడు వీరాంజనేయశర్మ భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

➤ యద్దనపూడి మండలంలోని యనమదల, యద్దనపూడి, అనంతవరం, పూనూరు గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో హనుమజ్జయంతి సందర్భంగా స్వామివారికి అర్చకులు పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

➤ చినగంజాంలో హనుమజ్జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల కార్యాలయం వద ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద మాజీ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీఎస్సార్ ఆంజనేయులు, కుర్రి రామసుబ్బారావు దంపతులు పలువురు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హనుమజ్జయంతిని పురస్కరించుకొని స్వామికి ప్రత్యేకంగా చేయించిన కిరీటాన్ని అలంకరించి పూజలు చేశారు.

➤ పర్చూరు వై జంక్షన్ కపిస్థలి వద్ద ఉన్న 95 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద హనుమజ్జయంతి, విగ్రహ ద్వితీయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు 11 మంది దంపతులచే విశేష పూజలు నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.


వేటపాలెంలో అలకంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్


ఈపూరుపాలెంలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న ఆంజనేయస్వామి


పూనూరులో విశేష అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

లక్ష తమలపాకులతో అంజన్నకు పూజ..

అద్దంకిరూరల్/బల్లికురవ/జే.పంగులూరు/మేదరమెట్ల/అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చన నిర్వహించారు. లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విమాన శిఖరం నిర్మాణ దాత నలమలపు విజయభాస్కర్ రెడ్డి, శ్రీదేవి దంపతులను దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ ఎం తిమ్మనాయుడు, రిషిత దంపతులు సత్కరించారు. యాగశాలలో నిర్వహించిన మజ్ఞంలో పాల్గొన్నారు. అద్దంకిలోని బాలాంజనేయస్వామి దేవస్థానం, మాధవస్వామి దేవస్థానంలో హనుమత్ జయంతి వేడుకలు నిర్వహించారు.

❋ పంగులూరు గ్రామంలో అంజనేయుడి చిత్రపటాన్ని గ్రామవీధుల్లో ఊరేగింపుగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈశ్వరి మాత పీఠాధిపతి పురోహితులు శ్రీనివాసాచారి కార్యక్రమం నిర్వహించారు. కార్యనిర్వాహణ బాధ్యతలు చేబ్రోలు రవీచంద్రాచారి నిర్వహించారు.

❋ బల్లికురవ మండలం కొత్తపాలెం, పెద అంబడిపూడి, కూకట్లపల్లి, కొణిదెన, నక్కబొక్కలపాడు, కొండాయపాలెం, గంగపాలెం, చెన్నుపల్లి, ముక్తేశ్వరం గ్రామాల్లోని అభయాంజనేయస్వామి ప్రసన్నాంజనేయస్వామి, వీరాంజనేయస్వామి నిలువెత్తు విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఐ. సుబ్బాచార్యులు, శివశాయి, శోభనాచార్యులు, నాగబ్రహ్మాచారి, ఉదయం 5 గంటల నుంచి పంచామృతాలతో అభిషేకం వివిధ రకాల పండ్లతో అభిషేకం, సిందూరంతో అభిషేకం, తమలపాకులతో అర్చన, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. కొత్తపాలెం, పెదఅంబడిపూడి గ్రామాల్లో ఆలయం కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేపట్టారు.

❋ కొరిశపాడు మండలంలోని అన్ని గ్రామాల్లో హనుమజ్జయంతి వైభవంగా నిర్వహించారు. మేదరమెట్ల తూర్పుపాలెంలోని అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద హనుమత్ పారాయణం చేశారు. సోమవరప్పాడులో వీరాంజనేయస్వామి దేవస్థానం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


శింగరకొండలో లక్ష తమలపాకుల పూజలో అంజన్న..


మేదరమెట్లలో పూజలు చేస్తున్న భక్తులు


పంగులూరులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు


పేరాలలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


వలపర్లలో హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దంపతులు


పర్చూరులో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న దంపతులు


ఈపురుపాలెంలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య


కొత్తపాలెంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


సోమవరప్పాడులో పూజల్లో పాల్గొన్న వైవీ భద్రారెడ్డి, తదితరులు


చినగంజాంలో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


పర్చూరులో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

వేడుకగా ఆలయ వార్షిక తిరునాళ్లు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మార్టూరు: మండలంలోని బబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాల పొలిమేరలో గల వీరాంజనేయ స్వామి ఆలయ 38వ వార్షికోత్సవ తిరునాళ్ల గురువారం ఘనంగా నిర్వహించారు. ఇదే రోజు హనుమజ్జయంతి కూడా కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల కోసం అన్నదానంతో పాటు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూజారులు ఉదయం 10 గంటలకు సువర్చలా సహిత వీరాంజనేయ స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం రైతుల ఆధ్వర్యంలో ఎడ్ల ప్రదర్శన, రాత్రి కోలాటం, భజన ప్రదర్శనలు నిర్వహించారు. ఎలక్ట్రిక్ ప్రభలతో పాటు ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన లైటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

వాహనదారులకు రూ. 2 లక్షల జరిమానా



సంతమాగులూరు (అద్దంకి రూరల్): హెల్మెట్ లేని వాహనదారులకు పోలీసులు జరిమానా విధించారు. మండల కేంద్రం సంతమాగులూరులో గురువారం ఎస్సై పట్టాభిరామయ్య వాహనదారులకు హెల్మెట్ లేనివారు, సీట్ బెల్టు పెట్టుకోనివారు, లైసెన్స్‌లు లేనివారి పట్టుకుని వారి నుంచి రూ. 2 లక్షల జరిమానా విధించి వసూలు చేశారు. అనంతరం వారికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపు

యద్దనపూడి: పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపొందించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయశాఖ బాపట్ల మార్కెంటింగ్ ఎస్ఎఫ్ఏ శ్రీనివాసరావు రైతులకు సూచించారు. గురువారం మండలంలోని జాగర్లమూడిలో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల కోసం జీలుగ, పిల్లపెసర, జనుము, జొన్న, మొక్కజొన్న, సజ్జ, ఉలవలు, అలసందలు, పెసలు, మినుములు, వంటి 22 రకాల విత్తనాలను భూమిలో చల్లి 40 రోజుల్లోపు భూమిలో కలియదున్నితే నిర్జీవమైన భూమి తిరిగి జీవం పోసుకొని ఆరోగ్యకరమైన పంటలను అందిస్తుందన్నారు. తద్వారా పచ్చిరొట్ట ఎరువులను వినియోగించటం ద్వారా భూమి గుల్లబారడమే కాక, పంట మార్పిడి వల్ల దిగుబడులు ఆశించినస్థాయిలో కంటే అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం పీఎండీఎస్ కిట్లను తయారుచేసి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో పర్చూరు డివిజన్ మాస్టర్ ట్రైనర్ వెంకటేశ్వర్లు, జాగర్లమూడి ఎల్‌టూ కోటిబాబు, ఐసీఆర్పీలు సౌమ్య, కోమలి, పద్మజ, నరేష్ , భారతి, రైతులు పాల్గొన్నారు.

రాతి ముఖమండపానికి విరాళాలు


రాతిముఖ మండపానికి విరాళాలు అందజేసిన దాతలకు స్వామివారి పటాన్ని అందిస్తున్న ఏసీ


మారుతి భవన్‌లో ఏసీ, గీజర్, మంచం అందజేసిన దాతలకు జ్ఞాపిక అందిస్తున్న ఏసీ

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి నూతనంగా నిర్మాణం చేసిన రాతి ముఖమండపానికి అద్దంకికి చెందిన తంగా రజనీ కుమార్ జ్ఞాపకార్థం ఆయన భార్య పద్మజా నాయుడు రూ.1 లక్ష అద్దంకికి చెందిన రాచమల్లి మోహన్‌కృష్ణ, మనసా సాయి మహాలక్ష్మీలు రూ. 1 లక్షలు, కశ్యాపురం గ్రామానికి చెందిన మక్కెన వెంకటరత్నం, చింపిరయ్య జ్ఞాపకార్థం మక్కెన నాగబ్రహ్మం రూ. 1 లక్ష, అద్దంకికి చెందిన బండారు వెంకటప్పయ్య జ్ఞాపకార్థం వెంకట రామానుజమ్మ రూ. 1 లక్ష, అద్దంకికి చెందిన కాకాని హరిబాబు సీతమ్మ దంపతులు రూ.1 లక్ష, అద్దంకి చెందిన చెన్నుపాటి రామాంజనేయులు, రత్నకుమారి దంపతులు మారుతి భవన్ లోని రూముకు అవసరమైన ఏసీ, గీజర్, మంచం విరాళాలను దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ యం. తిమ్మానాయుడుకు అందజేశారు.

విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు వరం


విద్యార్థులకు వివరిస్తున్న గ్రంథపాలకుడు

సంతమాగులూరు(అద్దంకి):

వేసవి విజ్ఞన శిబిరాలు విద్యార్థులకు ఒక వరమని గ్రంథపాలకుడు విజయభాస్కరరెడ్డి అన్నారు. గురువారం ఆయన సంతమాగులూరులోని గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరాం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ అంశాల్లో తర్ఫీదునిచ్చారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు మ్లాట్లాడుతూ ఇద్యార్థులంతా వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అట్టహాసంగా ఎన్‌సీసీ క్యాంప్ ప్రారంభం


క్యాంప్‌కు హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్‌లు

వేటపాలెం: చీరాల ఇంజినీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో 23 రాష్ట్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఏన్‌సీసీ క్యాంపు గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్ఎస్ పర్మర్ మాట్లాడుతూ పది రోజుల పాటు జరిగే ఈ క్యాంప్‌నకు గుంటూరు గ్రూప్ ఆధ్వర్యంలో ఆరు జిల్లాల నుంచి 740 మంది క్యాడెట్‌లు హాజరయ్యారని తెలిపారు. శిక్షణ శిబిరంలో క్యాడెట్‌లకు శారీరక వ్యాయామం ఆయుధ శిక్షణ, వ్యక్తిత్వ వికాసం, ఎన్‌సీసీ సాధారణ సామాజిక అవగాహన, ర్యాగింగ్, ప్రకృతి విపత్తులపై శిక్షణ, డ్రిల్ తదితర అంశాలపై క్యాడెట్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ శిబిరానికి డిప్యూటీ క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కలన్నల్ దినేష్‌కుమార్ వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ నజీర్, వివిధ కళాశాలల ఎన్‌సీసీ అధికారులు మేజర్ రాజు, లెఫ్టినెంట్ హరీష్, మేడికొండ రాజేష్‌బాబు, ఏఎన్‌ఓ సురేష్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, బీహెచ్ ఎం రమేష్ పాల్గొన్నారు.

నల్లబర్లీ నిల్వల వివరాలు ఇవ్వాలి

బల్లికురవ: గ్రామాల వారీగా నల్లబర్లీ పోగాకు సాగు చేసిన రైతులు నిల్వ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో తెలియజేయాలని వ్యవసాయాధికారిణి ఎస్వీపి కుమారి కోరారు. వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని వేమవరం, కొణిదెన గ్రామాల్లో నిల్వలు నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. రైతు సేవా కేంద్రాల్లోని సహాయకులను సంప్రదిస్తే వారు నిల్వలను పరిశీలించి రైతు ఫోటోతో యాప్‌లో అప్‌లోడ్ చేస్తారని, దీంతో కొనుగోళ్ల ప్రక్రియకు మార్గం సుగమం అవుతుందని కుమారి వివరించారు.

జే.పంగులూరు: 2024–25 రబీ కాలంలో నల్లబర్లీ పొగాకు పంట సాగు చేసిన రైతులు వివరాలను రైతు సేవా కేంద్ర అధికారులు యాప్‌లో పంట సాగు వివరాలు నమోదు చేయించుకోవాలని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం వద్ద అధార్ కార్డు, ఫోన్ నంబర్, పంట విస్తీర్ణం, దిగుబడి, నిల్వ ఉన్న పంట వివరాలు తెలియజేయాలన్నారు.


వేమవరంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో

హ్యూమన్ రైట్స్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మేడికొండ

చీరాల టౌన్: హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మేడికొండ సురేష్‌బాబు నియమితులయ్యారు. ఈమేరకు గురువారం ప్రకాశం, బాపట్ల జిల్లాల హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తులసీ చంద్రశేఖర్ నియామక పత్రాన్ని సురేష్‌బాబుకు అందించారు. మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయ సాధన కోసం హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ పనిచేస్తుందన్నారు. నియోజకవర్గ నూతన అధ్యక్షులు సురేష్‌బాబు చీరాల ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్షుడిగా ఎమ్మెల్యే సత్కరించి నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.